# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





### వాళ్లకు ఎవుసం తెలుసా?

కాంగ్రెస్ నాయకులు రైతులకు మూడు గంటల కరెంటు సరిపోతదని మాట్లాడుతున్నరు. వాళ్లకు అసలు వ్యవసాయం గురించి తెలువదు. మూడు గంటల కరెంటు ఇస్తే రోజుకొక్క మడి కూడా తడవదు. రేవంత్ రెడ్డి 10 హెచ్‌పీ మోటర్ అంటున్నడు. నాకు తెలిసిన వరకు బావుల వద్ద 10హెచ్‌పీ మోటర్లను సూడలే. నాకు 3 ఎకరాల పొలం ఉన్నది. ఇందులో వ్యవసాయ బావి ఉంది. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్ ఇవ్వబట్టి ఒక్క బావితో 3 ఎకరాలకు నీళ్లు పెట్టుకుంటున్న. 10 హెచ్‌పీ మోటర్ పెడితే బావిలో నీళ్లు లేకుండా పోతయ్. రైతులకు కేసీఆర్ సారు మంచిగా చేస్తుంటే వాళ్ల కండ్లు మండుతున్నయ్.

-కందాల కొమురెల్లి, రైతు (ఇల్లందకుంట)

### మూడు గంటలెట్ల సరిపోతది



కాంగ్రెస్ అంటున్నట్లుగా మూడుగంటల కరెంటు ఇస్తే ఎట్ల సరిపోతది. మూడు గంటల కరెంటుతో చివరి మడికి నీరందదు. 10 హెచ్‌పీ మోటర్లను రైతులు పెట్టుకోవాలని అంటున్నారు. దీనివల్ల రైతులపై అదనపు భారం పడుతది. ఇప్పుడు కరెంటుతో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినాక ఎంత భూమి ఉంటే అంత భూమిలో పంట తీస్తున్నం.

- కొత్త సూర్యప్రకాశ్‌రెడ్డి, రైతు, వెన్కేపల్లి(సైదాపూర్)

### మళ్లీ బాయిల కాడ ఉండాల్సిందే..



కాంగ్రెస్ పార్టీ అధికారంలకు వచ్చి మూడు గంటల కరెంటు గనుక ఇస్తె మళ్లీ మునుపటి రోజులత్తయ్.. కరెంటు కోతలు మొదలైతయ్.. రాత్రింబవళ్లు రైతులు బాయిల కాడనే ఉండాల్సి వస్తది.. రైతులకు మళ్లీ కష్టాలు మోపైతయ్.. మోటర్లపై భారం పడి కాలిపోతయ్.. రైతులపై భారం ఎక్కువైతది.. పంటల దిగుబడి తగ్గి దివాళా తీస్తరు.. భూముల ధరలు కూడా తగ్గుతయ్.. ఇప్పుడు ఇస్తన్న దినాం కరెంటుతో రైతులు సల్లంగ ఉన్నరు.. ఓట్లేసెటప్పుడు రైతులు తమ మంచి చెడ్డలను ఆలోచించి ఓటెయ్యాలె.

- గాలి ఘట్టయ్య, రైతు, తాడికల్ (శంకరపట్నం)

### ట్రాన్స్‌ఫార్మర్లు కాలి బూడిదైతయ్..

తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న నిరంతర విద్యుత్‌తో అన్నదాతలు సంతోషంగా ఉన్నరు. కాంగ్రెస్ హయాంలో పడ్డ కరెంటు బాధలు తప్పినయి. ఇప్పుడు కరెంటు పోతదనే బాధ లేనే లేదు. ఎప్పుడంటే అప్పుడు పొలం కాడికి పోయి మోటర్ స్విచ్ వేసుకుని నీళ్లు పెట్టుకుంటున్నం. కరెంటు నిరంతరంగా ఉండడంతో బావులు, బోర్ల కింద బంగారం లాంటి పంట పండుతున్నది. కాంగ్రెస్ పాలనతో పడ్డ కష్టాలు తప్పినయి. తిరిగి అటువంటి బాధలు ఎవ్వరికీ రావద్దు. ఎన్నికల్లో రైతులను మభ్యపెట్టే విధంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సరికాదు. అమలుకు సాధ్యం కాని మాటలు చెప్పితే రైతులు నమ్మరు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకుని వ్యవసాయ చేయడం అసాధ్యం. అంత కెపాసిటీ ఉన్న మోటర్లను పెట్టుకోవడం రైతుకు తలకు మించిన భారమే. అన్నదాతలంతా 10 హెచ్‌పీ మోటర్లను స్టార్ట్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిబూడిదవుతయి. కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోని హామీలతో రైతులను తప్పుదోవ పట్టిస్తూ, వ్యవసాయాన్ని కుప్పకూల్చే ప్రయత్న చేస్తున్నరు. అన్నదాతలు అంతా బాగా ఆలోచించాలి.

- సోమిరెడ్డి లక్ష్మారెడ్డి, చింతకుంట (ముకరంపుర)





### పైపులైను ఆగుతదా..?

రేవంత్ రెడ్డి చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటరు పెట్టుకుంటే పైపులైను ఆగుతదా?. మా బావి దగ్గరి నుంచి పారకం కోసం మీదికి నీళ్లు పోవడానికి రెండున్నర ఇంచుల పైపులైను వేసినం. 10 హెచ్‌పీ మోటరు పెడితే పైపులు పగులుతయ్. ఈ విషయం రేవంత్‌రెడ్డికి తెలియదా?. కొత్తగా పైపులైన్ వేసుడు సాధ్యం కాదు. 10 హెచ్‌పీ మోటరు కొనే స్థోమత రైతులందరికీ ఉండదనే సంగతి ముందుగా తెలుసుకోవాలి. రేవంత్‌రెడ్డి సోయి లేకుండా మాట్లాడుతున్నడు. రైతులందరూ ఆయనకు దిమ్మ తిరిగేలా ఎలక్షన్ల బుద్ధి చెప్పాలె.

- కాటిపెల్లి తిరుపతిరెడ్డి, ఇప్పల్ నర్సింగాపూర్ (హుజూరాబాద్)

### 10 హెచ్‌పీ మోటర్ నేనెప్పుడూ సూడలే..



నేను 40 ఏండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్న. నేనైతే ఎప్పుడూ 10 హెచ్‌పీ మోటర్ సూడలేదు. మా ఊళ్లో కూడా వాడిన దాఖలాలు లేవు. ఇప్పుడు కాంగ్రెసోళ్లు 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలంటున్నరు. రైతుల్లో ఎక్కువ మంది నిరుపేదలే ఉన్నరు కాబట్టి 10 హెచ్‌పీ మోటర్లు కొనే సామర్థ్యం లేదు. ఇలాగైతే వ్యవసాయం మళ్లీ కష్టంగా మారే పరిస్థితి ఉంటది. సీఎం కేసీఆర్ లాగా వ్యవసాయానికి కరెంట్ ఇచ్చిన నాయకుడిని నేను ఇది వరకు సూడలేదు. కాంగ్రెసోళ్లను నమ్ముకుంటే నట్టేట ముంచేటట్టున్నరు. ఇప్పుడిప్పుడే పంటలు మంచిగ పండి రైతులు ఆనందంగా ఉన్నరు. కాంగ్రెసోళ్లు కరెంట్ మూడు గంటలు చాలని పిడుగుల్లాంటి మాటలంటున్నరు. వీళ్లను చూస్తే మంచిగనిపిస్తలేదు. పైసా లేకుండా కరెంట్ ఇచ్చే సీఎం కేసీఆరే ఉండాలి.

- ఎన్ లక్ష్మయ్య, బద్దిపల్లి, (కొత్తపల్లి)

### ఎవుసం మొదటికి వచ్చినట్టే..



ఇప్పుడున్న కరెంటుతో ఎవుసాన్ని పండుగల లెక్క చేసుకుంటున్నం. మూడెకరాల భూమిల రూపాయి ఖర్చులేకుండ పంటలను పండిచ్చుకుంటున్నం. గత ప్రభుత్వాల పాలనల సాగునీళ్లు, సరిపడా కరెంటు లేక అరిగోస పడ్డం. నాణ్యతమైన కరెంటు లేక మోటర్లు కాలిపోయేవి. పంటలు చేతికి వచ్చేటైంకు మోటరు కాలితే వైడింగ్ షాపు దగ్గర పడిగాపులు కాసెటోళ్లం. రిపేరుకు పది వేలు ఖర్చయ్యేది. బీఆర్ఎస్ పాలనల రైతుల ఇబ్బందులు పోయినయ్. ఎవుసం గురించి తెల్వనోళ్లే మూడు గంటల కరెంటు పాట పాడుతున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలనే నాయకులకు ఎవుసంపై కనీస అవగాహన లేదు. లక్ష దాకా ఖర్చయ్యే మోటరు పెట్టి ఎవుసం చేసే స్థోమత మాకు లేదు. ప్రతి పక్షాల మాటలను నమ్మం. అడగకున్నా అన్నం పెట్టే నాయకుడి వెంటే ఉంటం. అడ్డగోలుగా మాట్లాడే నాయకులకు బుద్ధి చెప్తాం.

- రవీందర్, కోతిరాంపూర్, కరీంనగర్ (తెలంగాణచౌక్)

### చాలా ఖర్చు పెట్టాలే



నాడు సమైక్య రాష్ట్రంలో రాత్రి పూట కరెంటు ఇచ్చేటోళ్లు. ఆ ఇచ్చిన కరెంటుతో పొలమంతా సరిగా పారేది కాదు. ఇప్పుడు తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఎవుసానికి 3 గంటల కరెంటు సాలు.. 3 గంటల్లో పొలం అంతా పారుతదన్నడు. ఇందుకు 10 హెచ్‌పీ మోటర్లను పెట్టుకోవాలని చెబుతుండు. పొలాలకు 10 హెచ్‌పీ మోటర్లు ఉన్నాయా, తేవాలంటే ఎంత ఖర్చు పెట్టాలి. ఎవ్వరు ఇయ్యాలే. గిట్లాంటి 10 హెచ్‌పీ మోటర్లు వాడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవా..? గీ మాత్రం వీళ్లకు తెలియదా..? ఎవుసం మీద సోయి ఉండే మాట్లాడుతుండా..? సామాజిక పరిస్థితులు తెలియని వ్యక్తికి పరిపాలన ఇస్తే ఇగ ఆగమవుడే. గిట్లాంటోళ్లకు ఓట్లు వేస్తే మళ్లీ మన బతుకులు మొదటికే వస్తయి.

-నామాల శ్రీనివాస్, రైతు, సదాశివపల్లి (మానకొండూర్ రూరల్)

### రైతుకు మూడు గంటల కరెంట్ సరిపోదు



వ్యవసాయం చేసే రైతులకు రోజూ మూడు గంటల కరెంట్ సరఫరా సరిపోదు. తెలంగాణలో రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడుతలేరు. రైతులు వాడేది 3 హెచ్‌పీ మోటర్లే. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే లోవోల్టేజీ సమస్యలు అధికమవుతాయి. అందరూ రైతులు ఒకేసారి 10 హెచ్‌పీ మోటర్లు వాడితే ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్లు పని చేయవు. నిత్యం కరెంట్ సమస్యతోపాటు రైతులకు మోటర్ల రిపేర్ చార్జిలు కూడా భారమవుతాయి. ఇప్పుడు 24 గంటల కరెంట్ ఇస్తేనే రైతులకు సరిపోతుంది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టి మూడు గంటల కరెంట్ ఇస్తే, వ్యవసాయం చేయడం చాల కష్టమౌతుంది. మూడు గంటల కరెంట్‌తో కనీసం రెండు ఎకరాలు కూడా పారదు. మూడు గంటల కరెంటు సరిపోతుందని చెబుతున్న రేవంత్‌రెడ్డికి సాగు గురించి ఏం తెలుసు. వ్యవసాయం గురించి తెలవనోళ్లు గిట్లనే అడ్డం దొడ్డం మాట్లాడతరు.

- పబ్బతి రంగారెడ్డి, రైతు, దుబ్బపల్లి(కరీంనగర్ రూరల్)

# నువ్వద్దు.. నీ కరెంటద్దు

### కాంగ్రెస్‌ను నమ్మితే నిండా మునుగుడే

- యాభై ఏండ్లలో చేసిందేమీ లేదు
- ఇప్పుడొచ్చి మళ్లీ మాయమాటలు చెబుతున్రు
- పూటకో మాటతో ఆగం చేస్తున్రు
- 10 హెచ్‌పీ మోటర్లతో ఏం ఫాయిదా..
- ఒక్కో రైతు లక్ష రూపాయలు ఎక్కన్నుంచి తెస్తడు
- స్పష్టం చేస్తున్న రైతులోకం

కరీంనగర్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కాంగ్రెస్ మొదటి నుంచి రైతు వ్యతిరేకిగా ఉన్నది. యాభై ఏండ్లకుపైగా పాలించినా రైతులకు చేసిందేమీలేదు. కరెంట్ సక్కగా ఇయ్యలె. నీళ్లు సక్కగా ఇయ్యలె. పంటలు ఎండిపోతున్నా పట్టించుకోలె. ఆఖరుకు అప్పుల బాధతో సచ్చిపోయినా ఆదుకోలె. మళ్లీ ఆ పార్టీ నాయకులు ఇప్పుడొచ్చి మాయమాటలు చెబుతున్రు. బీఆర్ఎస్ సర్కారు 24గంటల కరెంట్ ఇస్తాంటే.. మేమేదో చేస్తామంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్రు. మమ్మల్ని ఆగం చేయాలని చూస్తున్రు. మళ్లీ మేం మోసపోం. మా బతుకుల్లో మట్టి పోసుకోం' అని జిల్లా రైతులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ సర్కారు రైతుల కోసం 24 గంటల కరెంట్, సాగునీరు, రైతుబంధు, రైతుబీమా ఇస్తున్నదని, అన్నదాతలు ఇప్పుడిప్పుడే సంతోషంగా బతుకున్నారని చెబుతున్నారు. కానీ, కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నదని, అందుకే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని, మంచి పథకాలను రద్దు చేస్తామంటున్నదని మండిపడుతున్నారు. ఎన్నికల్లో ఎలాగైనా లబ్ధిపొందాలన్న ఉద్దేశ్యంతో అబద్ధపు హామీలు, ఝూటా మాటలు చెబుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో అలాగే చెప్పి నిండా మోసం చేసిందని, ఇప్పుడు ఇక్కడ ఇలాగే చేయాలని చూస్తున్నదన్నారు. కరెంట్‌పై పూటకోమాటతో పరేషాన్ చేస్తున్నదని, ఓసారి 3గంటల కరెంట్ సరిపోతుందని, అదెలా సాధ్యమంటే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నారని మండిపడుతున్నారు. అసలు వ్యవసాయ బోర్లకు ఆ మోటర్లు పెట్టుకుంటారా..? ప్రశ్నించారు. అవి పెట్టాలంటే ఒక్కో రైతుపై లక్షకుపైగా ఖర్చవుతుందని, ఆ పైసలు వాళ్ల ఇంట్ల నుంచి ఇస్తారా..? అని ధ్వజమెత్తారు. పెద్ద మోటర్లు పెట్టుకుంటే కరెంటు సరిపోతదా..? బావుల్లో, బోర్లలో నీళ్లు ఊర్తయా..? నీటి ప్రెషర్‌ను పైపులు తట్టుకుంటయా..? లోడ్ పడి ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా..? అని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఎద్దెర్కనా..? ఎవుసమెర్కనా..? నిలదీస్తున్నారు. సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో తాము ఎదుర్కొన్న చీకటి కష్టాలు మళ్లీ వద్దని రైతన్నలు ముక్తకంఠంతో స్పష్టం చేస్తారు. ఈ కాంగ్రెసోళ్లు మా బతుకులు ఆగం చేయాలని చూస్తున్నారని, వాళ్ల మాటలతో మోసపోమని స్పష్టం చేస్తున్నారు. రైతుకు అన్ని విధాలా అండగా నిలిచిన బీఆర్ఎస్ సర్కారునే మళ్లీ గెలిపించుకుంటామని చెబుతున్నారు.

### కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతు బతుకు ఆగమే..



స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అప్పుడు ఇయ్యలేని హామీలు ఇప్పుడు ఇస్తామంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నది. అవి నమ్మితే తెలంగాణ రైతుల బతుకు ఆగమైతది. మూడు గంటల కరెంటు రైతులకు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్‌తో గంటల ఎకరం పారించవచ్చు అని అంటున్న ఆ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డి మాటలు వినీ కూడా వారికి ఓటేస్తే వ్యవసాయం పూర్తిగా అధోగతిపాలవుతుంది. ఎలాంటి బరువు బాధ్యతలు లేకుండా రోడ్లపై తిరిగే యువకుల మాటలు విని కాంగ్రెస్, బీజేపీకి రైతులు ఓట్లేస్తే వాళ్ళ బతుకులు బస్టాండయితయి. ఎవుసం పూనాస పడుతుంది. కరెంటు, నీళ్లు ఉంటేనే అందరికీ పని దొరుకుతుంది. కనుక ఇప్పటికైనా రైతులను అన్ని విధాలుగా ఆదుకునే సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలి. అది మన రైతుల చేతుల్లోనే ఉంది. కాంగ్రెస్ నేతల మాటలు విని రాష్ట్రాన్ని వారి చేతుల్లో పెడితే మళ్లీ 20 ఏండ్లు వెనుకకు పోతాం.

- పోరెడ్డి తిరుపతిరెడ్డి, రైతు, పెద్దపాపయ్యపల్లి (హుజురాబాద్‌టౌన్)

### 10 హెచ్‌పీ మోటర్లు ఎవరూ వాడరు

వ్యవసాయానికి ఇప్పుడున్న కరెంట్ సరఫరాతో ఎలాంటి ఇబ్బంది లేదు. 24 గంటల నాణ్యమైన కరెంటు ఉంటుంది. బోర్లు, బావుల్లో పుష్కలంగా నీరు ఉంది. ఎప్పుడంటే అప్పుడు మోటర్ ఆన్ చేసుకుని పొలాలకు నీళ్లు పెట్టుకుంటున్న. కానీ కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు మూడు గంటల కరెంటు అయితే రైతులకు కష్టాలు మొదలైనట్లే. రైతులు భార్యా, పిల్లలను వదిలిపెట్టి రాత్రంతా బావులు, బోర్ల కాడ జాగారం ఉండాలి. రాత్రిపూట పాములు, తేల్ల కాటుకు చనిపోవాల్సిందే. రైతుల ప్రాణం పోతే వాళ్ల కుటుంబాలు ఆగమైపోతాయి. ఆ పాపం అంత కాంగ్రెస్‌దే. రైతులెవ్వరూ 10హెచ్‌పీ మోటర్లు వాడరు. ఐదు నుంచి పది ఎకరాల వరకు రైతులు కూడా 3హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటర్లే వాడతరు. సామాన్య రైతులు 10 హెచ్‌పీ మోటర్లు ఎందుకు వాడతరు. 10 హెచ్‌పీ మోటర్లతో బావిలో నీరు త్వరగా ఖాళీ అయిపోయి మోటర్ మీద భారం పడుతుంది. కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డికి వ్యవసాయం మీద కనీస అవగాహన ఉన్న చిన్న, సన్నకారు రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడరు అనే విషయాన్ని గుర్తించాలే. రేవంత్‌రెడ్డి అలాంటి పలికిమాలిన మాటలు మాట్లాడడం సరికాదు.

- బోడ నర్సింహారెడ్డి, రైతు, దుబ్బపల్లి (గన్నేరువరం)





### ధరణి తీసేస్తే లంచాల బాధ తప్పదు

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ చాలా బాగుంది. ధరణి పోర్టల్ ద్వారా అరగంటలో భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వారం రోజుల్లోనే పాస్ బుక్ ఇంటికి వస్తుంది. ఎక్కడా ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం వేలిముద్ర వేస్తేనే పోర్టల్ ఓపెన్ అవుతుంది. గతంలో రైతులు కార్యాలయం చుట్టూ తిరిగేటోళ్లు. కింద నుంచి పైదాకా ప్రతీ అధికారికి లంచం ఇవ్వాల్సిన పని ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులు ఇబ్బంది పడతరు. ధరణి తీసేస్తే మళ్లీ లంచాల బాధ తప్పదు.

- కానుగంటి సత్యనారాయణరెడ్డి, రైతు, ఉప సర్పంచ్, గొల్లపల్లి (తిమ్మాపూర్ రూరల్)



### మల్లా ఎమ్మార్వో ఆఫీసుల సుట్టూ తిరుగుడే

ధరణిని రద్దు చేసి పాత వ్యవస్థ వస్తే, మల్లా ఎమ్మార్వో ఆఫీసుల సుట్టూ తిరుగుడే. ఇక చెప్పులు అరుగుడే ఉంటది. ధరణిని తీసేస్తే పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తుంది. మళ్లీ బ్రోకర్లు పుట్టుకొస్తరు. ఇప్పుడు ఉన్న ధరణితో సమస్యలు తొలిగిపోయాయి. ధరణిని తీసేసి భూమాతను తీసుకొస్తే కాంగ్రెస్ నాయకులే బ్రోకర్ల అవతారమెత్తుతరు. ధరణితో పట్టదారు పుస్తకాలు, వెంటనే మ్యూటేషన్ అయి ఇస్తున్నరు. ఆనాడు పట్వార్ల చుట్టూ తిరుగుతూ.. ఏమన్న జేబు వాటం ఇస్తేనే పని అయ్యేది. ధరణి తీసేస్తే మళ్లీ రైతులు ఆగం కావల్సిన పరిస్థితి వస్తుంది. ధరణి వచ్చినంకనే అక్రమాలు తగ్గి, రిజిస్ట్రేషన్ సులభతరమైంది. రైతు వేలి ముద్రలు లేకుండా పట్టా మారదు.

-సాదినేని ఆదిరెడ్డి, రైతు, సదాశివపల్లి (మానకొండూర్ రూరల్)

### ధరణి తీసేస్తే..మల్లా కాళ్లరిగేలా తిరగాలి



కాంగ్రెస్ ధరణి తొలగిస్తామంటుంది. ధరణితోనే రైతులకు ఎంతో మేలు. ధరణి పోర్టల్ ద్వారా అరగంటలో భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 15 రోజుల్లోనే పాస్ బుక్ ఇంటికి వస్తుంది. ఒక్క రూపాయి కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పని లేదు. మన వేలిముద్ర వేస్తేనే పోర్టల్ ఓపెన్ అవుతుంది. మన భూమి ఎక్కడికీ పోదు. ల్యాండ్ కన్వర్షన్ కూడా పది నిమిషాల్లో అయిపోతుంది. గతంలోనైతే రైతులు కార్యాలయాలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి ఉండేది. కాంగ్రెస్ చెప్పినట్లు పటేల్, పట్వారీ వ్యవస్థ లాంటిది మల్ల వస్తే రైతులు కష్టాలు పడతరు. అధికారుల చేతివాటం ఎక్కువవుతుంది. రైతులకు చిన్న పహానీ నకలు కావాలన్నా, రెవెన్యూ ఆఫీసర్ చుట్టూ తిరగాల్సి వస్తుంది. రైతులు భూమాత పోర్టల్‌ను వ్యతిరేకిస్తున్నరు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి.

- సందవేని ప్రశాంత్ యాదవ్, రైతు, (గన్నేరువరం)

# ధరణి ఎత్తేస్తే దోపిడే..

- మళ్లీ ఎనకటి 'కాలం' వస్తది
- పైరవీకారులు రాజ్యమేలుతరు
- లంచావతారులు పుట్టుకొస్తరు
- పహణీ కావాలన్నా కాళ్లరిగేలా తిప్పకుంటరు
- రికార్డులు తారుమారు చేస్తరు
- భూముల పంచాయితీలు మొదలైతయ్
- రైతులను కాంగ్రెస్ ముంచాలని చూస్తున్నది
- ఆ పార్టీ నాయకులను నమ్మేది లేదు

కరీంనగర్, నవంబర్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గతంలో భూమి హక్కులకు సంబంధించి అనేక రికార్డులు ఉండేవి. ముఖ్యంగా రెవెన్యూ అధికారుల చేతుల్లో 11 రకాల రికార్డులు నిర్వహించేవారు. ప్రభుత్వ, ప్రైవేట్, రైతు ల భూములు ఇలా అన్ని రకాల భూముల వివరాలు వాళ్ల చేతుల్లోనే ఉండేవి. ఒక్కో రికార్డులో మళ్లీ పదుల సంఖ్యలో కాలమ్స్ ఉండేవి. అధికారులే రాతపద్ధతిలో ఆ లెక్కల్లో మార్పు లు, చేర్పులు చేసేవాళ్లు. ఇక్కడే విచ్చలవిడి అవినీతి జరిగేది. ముఖ్యంగా పహణీలో అక్రమాలకు అంతులేకుండాపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణిలో ఉన్న రికార్డులో మార్పులు, చేర్పులు చేసే అధికారాన్ని కిందిస్థాయి అధికారులకు లేకుండా చేసింది. ఏదైనా సమస్య ఉంటే రైతు దరఖాస్తు పెట్టుకున్న తర్వాత.. కలెక్టర్ మాత్రమే పరిశీలించి మార్పు చేసే అవకాశం కల్పించింది. గతంలో మాదిరిగా వీఆర్వోలు, ఆర్ఐలు, ఎమ్మార్వోలు, ఆర్డీవోలు ఇష్టం వచ్చినట్టు రికార్డులు మార్చే సంస్కృతికి చరమగీతం పాడింది. ఏకంగా వీఆర్వో వ్యసవ్థను రద్దు చేసింది. అయితే, ఇటీవల కాంగ్రెస్ నాయకులు ధరణిని రద్దు చేసి పాత పద్ధతినే తెస్తామని చెబుతుండడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పాత పద్ధతి తెస్తే మళ్లీ రైతులు భిక్షమెత్తుకోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. పైరవీకారులు రాజ్యమేలుతారని, లంచావతారులు పుట్టుకొస్తారని, ఏ చిన్న పనికైనా అధికారులు తమ చుట్టూ ఏండ్ల తరబడి తిప్పుకుంటారని, రికార్డులు తారుమారు చేసి ఒకరికొకరికి మధ్య పంచాయితీలు పెట్టిస్తారని వాపోతున్నారు. కాంగ్రెస్ నాయకులు రైతులను ముంచాలని చూస్తున్నదని మండిపడుతున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ వారిని నమ్మేది లేదని, తప్పకుండా బుద్ధి చెప్తామని స్పష్టం చేస్తున్నారు.

### భూముల లెక్కే ఉండది



ధరణి రాకముందు మా నాన్న పేరు మీద 10 గుంటలు రికార్డులకు ఎక్కించడానికి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. చాలా మంది రైతులు ఇలాంటి సమస్యలతో ఇబ్బందులు పడ్డరు. అట్లనే మనకు సంబంధించిన భూమి లంచాలు ఇచ్చి ఇతరులు మార్చుకునే అవకాశం లేకపోలేదు. పాత కాలం రికార్డుల ప్రకారం బలమున్నవాడిదే భూమి అన్నట్లు ఉండేది. ఒక అధికారికి తెలియకుండా కూడా రికార్డులు తారుమారు చేసే వ్యవస్థ ఉండేది. మోఖా మీద ఒక రైతు ఉంటడు.. అతడికి తెలియకుండానే మరో రైతు రికార్డుల్లో ఉండేటోడు. అప్పట్లో అలా ఉండేది వ్యవస్థ. కేసీఆర్ సార్ వచ్చి ధరణితో అద్భుతమైన రికార్డులను తయారు చేసిండు. ధరణి పోతే భూముల లెక్కే తప్పుతుంది. - గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, రైతు, ఉపసర్పంచ్, రామకృష్ణ కాలనీ(తిమ్మాపూర్)

### పట్వారీ వ్యవస్థతో మళ్లీ కష్టాలే..



నాకు 12 ఎకరాల భూమి ఉంది. ధరణితో నాకున్న భూమి ఆన్‌లైన్‌లో ఎక్కింది. ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు. తెలంగాణ రాక ముందు ఉన్న పట్వారీ వ్యవస్థ వల్ల తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరిగీ తిరిగి కాళ్లకు చెప్పులు అరిగిపోతుండె. అప్పుడు మస్తు గోస పడ్డం. పహనీ కావాలని పట్వారీ దగ్గరికి వెళ్తే తింపుకొని తింపుకొని ఎంతో కొంత పైసలు ఇస్తేనే ఇచ్చెటోళ్లు. పట్వారీలు ఉన్నప్పుడు పంట నష్టం రాయాలన్నా, బ్యాంక్ లోన్‌కు భూ రికార్డులు కావాలన్నా ఖర్చు లేనిదే పనయ్యేది కాదు. భూమి కొని పట్టా చేసుకున్న తర్వాత దానిని రికార్డుల్లోకి ఎక్కించి మ్యుటేషన్ చేయించాలన్నా. పట్టా పాసుబుక్ కావాలన్నా తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరిగీ తిరిగి ఇబ్బంది పడేది. పట్వారీ వ్యవస్థతో రైతులంతా ఎన్నోపాట్లు పడ్డరు. కౌలుదారు, పట్టాదారు కాలమ్ పెట్టి భూములున్న రైతులను నట్టేట ముంచాలని చూస్తున్నరు. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సార్ ధరణితో ఒక్క దగ్గరనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసి సాయంత్రం వరకు పాసుబుక్ ఇస్తున్నరు. ఇప్పుడు మా భూమిపై మాకు పూర్తి అధికారం వచ్చింది. ధరణి తెచ్చి మాకు రైతు బంధు ఇస్తున్నరు. కాంగ్రెసోళ్లు ధరణి లేదు.. ఏమీ లేదు అంటున్నరు. ధరణి లేకపోతే రైతులు ఆగమవుతరు. ధరణితో లాభాలే తప్ప నష్టాలు లేవు.

- గుర్రం మల్లారెడ్డి, తూర్పురెడ్డి సంఘం అధ్యక్షుడు, చొప్పదండి

### నమ్మితే ఆగమాగమే..



ధరణి రద్దంటేనే భయమేస్తోంది. ఎందుకంటే ధరణి రాకముందు నేను అనుభవించిన కష్టాలు అన్నీ ఇన్ని కావు. ఇంటిపేరు తప్పు సరిదిద్దేందుకు ఒక సంవత్సరం పైనే తిరిగినా పనికాలే... పైసలు కూడా బాగా ఖర్చయినయ్. వీఆర్వో దగ్గరికి పోతే ఆర్ఐ దగ్గరికి పొమ్మనేవాళ్లు.. అక్కడికి పోతే ఎమ్మార్వో దగ్గరికి పొమ్మనేటోళ్లు.. పనిమాత్రం కాకపోయేది. ధరణి వచ్చినంకనే ఏ పని అయినా టక్కున అయింది. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ధరణిని తీసేస్తమంటున్నరు అందుకే భయం వేస్తోంది.

- డీ సంపత్, ఐనవారిపల్లె, కొత్తపల్లి

### మళ్లీ కష్టాలే



ధరణి వచ్చినంక నిరుపేదల బాధలు తొలిగినయ్. కార్యాలయాల చుట్టూ తిరుగుడు.. అధికారులకు దండం పెట్టే పరిస్థితి పోయింది. భూమి రిజిస్ట్రేషన్ పావుగంటల పూర్తయితంది. నయా పైసా ఖర్చులేదు. పాసుబుక్ టప్పాలో ఇంటికే వస్తుంది. కాంగ్రెసోళ్లు మళ్లీ పట్వార్ల పాలన రావాలని చూస్తున్నరు. ధరణిమీద వాళ్లకు అవగాహన లేదు. రాజకీయం కోసం పేదలకు ధరణి తీసేయద్దు. ఎన్నడూ చూడని విధంగా కంప్యూటర్లతో భూమి పనులు అవుతున్నయ్. యాజమానికి తెలియకుండా భూమి మార్పు జరగదు. మోసం పనులు చేస్తే సెల్‌కు మెసేజ్‌లు వస్తయ్. కాంగ్రెస్ మాటలను నమ్మితే పాత పెత్తందారుల వ్యవస్థ వస్తుంది. పిచ్చి మాటలు మాట్లాడుతున్న రేవంత్‌ను నమ్మం. ధరణి తీసేస్తే సహించం.

- యాదగిరి, ముదిరాజ్ సంఘం నాయకుడు, కట్టరాంపూర్, కరీంనగర్(తెలంగాణచౌక్)